సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



అప్రమత్తంగా ఉండాలి

వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

- 8లో ▸



12,413 ఎకరాల్లో పంట..

భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 12,413 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.9 /22.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. రోజంతా ఉరుముల, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరద బాధితులను ఆదుకుంటాం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



కామారెడ్డి టౌన్: వరద బాధితులను ఆదుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. గురువారం ఆమె ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్‌లతో కలిసి జిల్లాలోని జాతీయ రహదారి, కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీలను పరిశీలించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్రలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానికులకు పండ్లు, పులిహోర ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్ధరాత్రి క్లౌడ్ బరస్ట్ అవ్వడం వల్ల వరద ఉధృతి పెరిగిందన్నారు. వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, బాధితులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాలలో అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగించాలన్నారు. అప్రమత్తత వల్ల ప్రాణనష్టాన్ని నివారించగలిగామన్నారు.

జలదిగ్బంధంలో ఎక్సైజ్ భవనం

- వరదలో చిక్కుకున్న సిబ్బందిని రక్షించిన రెస్క్యూ టీం



మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ శివారులోని కప్పలవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ వరద చేరింది. బుధవారం రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సికిందర్, నైట్ వాచ్‌మెన్ గంగాధర్ గురువారం ఉదయం నిద్ర లేచే సరికి భవనం సగం మేర నీటమునిగింది. సమాచారం అందుకున్న రెస్క్యూ బృందం వారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చింది. ముచ్కూర్ శివారులోని రోడ్డుపై వరద ప్రవహించడంతో ఆటో చిక్కుకుపోయింది. డ్రైవర్‌తోపాటు ఇద్దరు మహిళలను జేసీబీ సహాయంతో బయటకు తీసుకువచ్చారు.

విద్యుత్ సరఫరాలో ఆటంకం తలెత్తొద్దు



డిచ్‌పల్లి: విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో పరిస్థితులను పరిశీలించేందుకు గురువారం ఆయన జిల్లాకు వచ్చారు. రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలం గన్నారం సబ్‌స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. విద్యుత్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డిచ్‌పల్లి సబ్‌స్టేషన్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

గోదావరి ఉగ్రరూపం



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. గంటగంటకూ వరద వాహం పెరిగింది. తెలంగాణ – మహారాష్ట్రను కలిపే అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి గోదావరి ప్రవహిస్తోంది. గురువారం ఉదయం 8.30గంటల నుంచి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు నిజాంసాగర్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయడం, అటు మహారాష్ట్ర నుంచి వరద పోటెత్తడంతో గోదావరి ప్రవాహం భారీ పెరిగింది.



సిరికొండ మండలం ముషీర్‌నగర్ గ్రామంలో ప్రవహిస్తున్న వరద



ఆర్మూర్‌లోని కమలానెహ్రూ కాలనీలో గుట్ట పైనుంచి పడిన బండరాయితో ధ్వంసమైన ఇల్లు

ఉరిమిన మేఘం

వరుణుడి గర్జనకు ఉమ్మడి జిల్లా అతలాకుతలమైంది. ఎటు చూసినా వరద నీరే కనిపించింది. ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో రెండు చెరువులు తెగిపోవడంతో పలు గ్రామాల్లోకి నీరు చేరింది. ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. పలు చోట్ల నేషనల్ హైవే, తలమడ్ల ప్రాంతంలో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో వాహనాలు, రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కాలనీలు చెరువులు, కుంటలను తలపించాయి. వరదలో చిక్కుకున్న పలువురిని రెస్క్యూటీములు, పోలీసులు కాపాడారు. కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి కురిపించిన వరుణుడు విలయ తాండవం చేశాడు. ఇద్దరు మృత్యువాతపడగా.. వాగులో గల్లంతయిన మరొకరి ఆచూకీ లభించలేదు. కార్లు, ఇతర వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. కామారెడ్డి జిల్లాలో 89,568 ఎకరాల్లో, నిజామాబాద్‌లో 12,413 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.



కామారెడ్డి జిల్లా సరంపల్లి ఎస్టీ హాస్టల్‌లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రెస్క్యూటీం

- సిరికొండ మండలం తూంపల్లిలో అత్యధికంగా 198.5 మి.మీ వర్షం
- తెగిన రెండు చెరువులు
- పలు గ్రామాల్లోకి చేరిన నీరు



సిరికొండ మండలం తూంపల్లి - కొండాపూర్ మధ్య కల్వర్టు తెగిన రోడ్డు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా వ్యాప్తంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. సిరికొండ మండలం తూంపల్లిలో అత్యధికంగా 198.5 మిల్లీ మీటర్లు, ధర్పల్లి మండల కేంద్రంలో 181.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 180.9 మి.మీ. వర్షం కురిసింది. ధర్పల్లి మండలం హొన్నాజీపేట అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువు తెగిపోవడంతో బీరప్ప తండా, నడిమి తండా, లక్ష్మీ చెరువు తండాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. ప్రజలు భయంతో ఇళ్ల పైకప్పుల పైకి చేరారు. ఇందల్వాయి మండలం రాంసాగర్ తండా చెరువు కట్ట తెగింది. గుట్టకింది తండా, దొన్కల్ చెరువులు ప్రమాదకరంగా పొంగిపొర్లడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పలుచోట్ల రోడ్లు తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోధన్ డివిజన్‌లో మంజీర నది ఉధృతంగా ప్రవహించడంతో పంటలు నీట మునిగాయి. 12,413 ఎకరాల్లో వరి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. శ్రీరాంసాగర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. రూరల్ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్యతో కలిసి ఎమ్మెల్యే భూపతిరెడ్డి పర్యటించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలోని కమలా నెహ్రూ కాలనీలో గుట్టపై నుంచి బండరాయి పడడంతో ఓ ఇంటి గోడ ధ్వంసమైంది. ఇందల్వాయి మండలం గన్నారంలో విద్యుత్ సబ్‌స్టేషన్ జలమయమైంది. జాతీయ రహదారి 44పకి పలుచోట్ల భారీగా వరద నీరు చేరడంతో నిజామాబాద్–హైదరాబాద్ రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మల్ నుంచి, నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సినవారు మెట్‌పల్లి, కరీంనగర్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. కామారెడ్డి జిల్లాలో పలుచోట్ల జాతీయ రహదారి కోతకు గురికావడంతో ఈ పరిస్థితి నెలకొంది. బాల్కొండ మండలంలో 12 కిలోమీటర్ల మేర లారీలు నిలిచిపోయాయి. నిర్మల్ వైపు కార్లు, బస్సులను మాత్రమే అనుమతిస్తున్నారు. లారీలు, ట్రక్కుల డ్రైవర్లు, క్లీనర్లకు రెవెన్యూ, పోలీసు అధికారులు ఆహారాన్ని, నీటిని అందిస్తున్నారు.



ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్, సీపీ

కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి..

- అతలాకుతలమైన జనజీవనం
- వర్షాలతో ఇద్దరు మృతి, మరొకరి గల్లంతు
- ఉప్పొంగిన వాగులు.. కొట్టుకుపోయిన రోడ్లు
- 55 చెరువులకు గండ్లు
- 89,568 ఎకరాల్లో నీట మునిగిన పంటలు



కామారెడ్డిలో నీట మునిగిన కార్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా భారీ వర్షం కురిసింది. రెండు రోజుల పాటు వాన దంచికొట్టడంతో జనజీవనం స్తంభించింది. జిల్లా కేంద్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజంపేటలో ప్రహరీ కూలి మీద పడడంతో డాక్టర్ వినయ్ మృతిచెందాడు. దోమకొండ మండలంలో ఎడ్లకట్ల వాగులో కొట్టుకుపోయినవారిలో ఇద్దరు సురక్షితంగా ఇళ్లకు చేరగా.. బాల్‌రాజ్ అనే వ్యక్తి ఆచూకీ లభించలేదు. బీబీపేట మండలం జనగామలో ఎడ్లకట్ల వాగులో చిక్కుకుని రాజిరెడ్డి అనే రైతు మరణించాడు.

జిల్లాలో ఆగస్టులో సాధారణ వర్షపాతం 224.4 మి.మీ. కాగా 529.0 మి.మీ. వర్షం కురిసింది. రాజంపేట, నాగిరెడ్డిపేట, భిక్కనూరు, ఎల్లారెడ్డి, లింగంపేట, కామారెడ్డి, దోమకొండ, నిజాంసాగర్, తాడ్వాయి, రామారెడ్డి, సదాశివనగర్, పాల్వంచ, మాచారెడ్డి, పిట్లం, బీబీపేట, మహ్మద్‌నగర్, గాంధారి మండలాల్లో రెండు రోజుల్లో 30 సెం.మీ. నుంచి 60 సెం.మీ. దాకా వర్షం కురిసింది. జిల్లాకేంద్రంలో పలువురి వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు విశేషంగా కృషి చేశాయి. 89,568 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లగా, 18 గేదెలు, 8 ఆవులు, పదివేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. 13 ఇళ్లు పూర్తిగా కూలగా, 310 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 44వ నంబరు జాతీయ రహదారి పలు చోట్ల ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి మీదుగా నిజామాబాద్, ఆదిలాబాద్ వెళ్లాల్సిన వాహనాలు చాలాచోట్ల గంటల తరబడి ఆగిపోవాల్సి వచ్చింది.



ధర్పల్లి మండలం వాడిలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

వర్షపు నీటిని వేడి చేసుకుని..

జిల్లా కేంద్రంలో వర్షంతో కరెంటు కూడా లేకపోవడంతో ప్యూరిఫైడ్ వాటర్ సమస్య ఏర్పడింది. దీంతో చాలామంది వర్షపు నీటిని బిందెల్లో నింపుకుని, కాచి చల్లార్చుకుని తాగారు. రెండు రోజుల పాటు వర్షం దంచికొట్టడంతో వాటర్ ప్యూరిఫయర్‌లు పనిచేయలేదు. దీనికి తోడు రోడ్లు కూడా దెబ్బతినడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో చాలా ఇళ్లలో వర్షపు నీటిని వేడి చేసుకుని తాగారు.



నల్లూర్ వద్ద హైవేపై నిలిచిపోయిన ట్రక్కులు



కామారెడ్డిలో ధ్వంసమైన హైవే

లక్షల క్యూసెక్కుల ఇన్ - అవుట్ ఫ్లో

- ఎస్సారెస్పీ 39 గేట్ల ఎత్తివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఇన్, అవుట్ ఫ్లో అనూహ్యంగా పెరిగింది. బుధవారం ఉదయం నుంచి వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రోజంతా నిలకడగా కొనసాగి సాయంత్రం నుంచి క్రమంగా వరద పెరిగింది. గురువారం మధ్యాహ్నం సమయానికి ఇన్‌ఫ్లో 2.75 లక్షల క్యూసెక్కులకు చేరింది. అదేస్థాయిలో వరద గేట్లు, కాలువల ద్వారా అవుట్ ఫ్లో కొనసాగించారు. సాయంత్రానికి 3.2 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరగగా, 39 వరద గేట్ల ద్వారా 3.55 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఎగువ నుంచి మరింత వరద వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి విడుదలను పెంచుతూ, తగ్గిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.



గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

67.05 టీఎంసీలు..

ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1087.20(67.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

రెండు రోజులు.. 13 టీఎంసీలు

ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాల్లో ముంపు ముప్పు తలెత్తకుండ అధికారులు చర్యలు చేపట్టారు. నీటి నిల్వను 80 టీఎంసీల నుంచి 67 టీఎంసీలకు తగ్గించారు.

తూంపల్లి, ధర్పల్లిలో అత్యధికం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా 80.09 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. నిజామాబాద్ నగరంలో బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు 6 సెం.మీ, గురువారం మధ్యాహ్నం 2 గంటల వరకు 5 సెం.మీల వర్షం కురిసింది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ మండలం తూంపల్లిలో 198.5 మి.మీ, ధర్పల్లిలో 181.5, ఇందల్వాయి మండలం గన్నారంలో 120.5, భీమ్‌గల్‌లో 115.8, మోర్తాడ్‌లో 103.5, బాల్కొండలో 102.8, డొంకేశ్వర్ మండలం తొండాకూర్‌లో 101.8, ఎడపల్లిలో 100.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వేల్పూర్‌లో 96.5, డిచ్‌పల్లి మండలం కోరట్‌పల్లిలో 94.5, కమ్మర్‌పల్లిలో 94.3, మెండోరాలో 87.0, ముప్కాల్ మండలం వేంపల్లిలో 83.5, బోధన్ మండలం బెల్లాల్‌లో 76.8, ముప్కాల్‌లో 74.8, సిరికొండలో 71.0, నందిపేట మండలం సీహెచ్ కొండూర్‌లో 68.3, మాక్లూర్ మండలం మదన్‌పల్లిలో 67.0, కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లో 60.8, కోటగిరిలో 60.5, సాలూరలో 60.5 మి.మీల వర్షపాతం నమోదైంది. జక్రాన్‌పల్లిలో 59.3, బోధన్ మండలం కల్దుర్కిలో 58.3, నవీపేటలో 58.0, చందూర్‌లో 58.0, రెంజల్‌లో 56.5, డిచ్‌పల్లిలో 55.0, మోస్రాలో 54.8, మాక్లూర్ మండలం లక్మాపూర్‌లో 54.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పొర్లుతున్న చెరువులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని పలు చెరువులు పొర్లుతున్నాయి. మొత్తం 1086 చెరువులకు గాను 410 చెరువులు నిండుకుండను తలపిస్తుండగా, 178 పొంగిపొర్లుతున్నాయి. 50శాతానికి పైగా చెరువులు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరాయి. 251 చెరువులు 75శాతం నిండాయి. జిల్లాలో ఉన్న సగానికిపైగా చెరువులు నిండాయని ఇరిగేషన్ సీఈ మధుసూదన్‌రావు తెలిపారు. రెండు చెరువులకు గండ్లు పడగా, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో మా శాఖ ఉద్యోగులందరినీ అప్రమత్తం చేశామని, చెరువుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలను పంపించాలని ఆదేశించినట్లు తెలిపారు.



నిండు కుండలా మారిన ఖిల్లా డిచ్‌పల్లి చెరువు

డివిజన్	మొత్తం చెరువులు	0- 25 శాతం	25 - 50	50 - 75	75 - 100	పొంగుతున్న చెరువులు
బోధన్	182	01	07	15	126	33
నిజామాబాద్	324	04	81	108	87	44
ఆర్మూర్	198	16	35	35	50	62
బాల్కొండ	292	50	51	86	94	11
బాన్సువాడ (6 మండలాలు)	90	00	2	7	53	28

నిలిచిన బస్సులు, రైళ్లు

- హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు నిలిపివేత
- వివిధ రూట్లల్లో 300 సర్వీసులు రద్దు

ఖలీల్‌వాడి: భారీ వర్షాల కారణంగా ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల రోడ్లు, తలమడ్ల వద్ద రైల్వే ట్రాక్ దెబ్బ తినడంతో బస్సులు, రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుంచి 584 బస్సులు ప్రతి రోజూ వివిధ రూట్లలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే భారీ వర్షం కారణంగా జాతీయ రహదారి 44పై పలు చోట్ల రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో హైదరాబాద్‌కు బస్సు సర్వీసులను రద్దు చేశారు. అలాగే ఎల్లారెడ్డి, భీమ్‌గల్, వర్ని, చందూర్, సిరికొండ, ధర్పల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద ప్రవహిస్తుండడం, రోడ్లు చెడిపోవడంతో ఆయా రూట్లలో మొత్తం 284 బస్సులు నిలిచిపోయాయి. వరద ప్రభావం అంతగా లేని ప్రాంతాలకు 300 బస్సులను యథావిధిగా నడుపుతున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు.



వర్ని - చందూర్ మధ్య రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించడంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

రద్దయిన 20 రైళ్లు

వరద ప్రవాహానికి కామారెడ్డి జిల్లా తల్లమడ్ల వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో సికింద్రాబాద్ – నిజామాబాద్ మధ్య 20 రైళ్ల రాకపోకలు రద్దయ్యాయి. రెగ్యులర్‌గా రాకపోకలు సాగించే 10 రైళ్లతోపాటు 10 ప్రత్యేక రైళ్ల నిలిచిపోయాయి. గురువారం నిజామాబాద్‌కు చేరుకున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ను ఆర్మూర్, కరీంనగర్ మీదుగా సికింద్రాబాద్‌కు మళ్లించినట్లు రైల్వే అధికారుల ద్వారా తెలిసింది.

రైల్వే హెల్ప్‌లైన్ నంబర్లు..

రైళ్ల రద్దు, రూట్ మళ్లింపు నేపథ్యంలో ప్రయాణికులకు సమాచారం అందించేందుకు రైల్వే హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. రైళ్ల రాకపోకల సమాచారం కోసం నిజామాబాద్ – 97032 96714, కామారెడ్డి – 92810 35664, సికింద్రాబాద్ – 040 27786170, కాచిగూడ – 9063 18082 నంబర్లను సంప్రదించాలని ప్రయాణికులకు రైల్వేశాఖ సూచించింది.

క్లుప్తంగా

సహాయక చర్యల్లో పోలీసులు



అర్సపల్లి వద్ద రోడ్డుపై నిలిచిన నీటిని పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న ఎస్సై వెంకట్రావు

ఖలీల్‌వాడి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సైలు, సిబ్బంది రోడ్లపై నిలిచిన నీటిని తొలగించి వాహనాదారులకు అంతరాయం కలగకుండా చేశారు. ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అర్సపల్లి ఎక్స్‌రోడ్డు, నెహ్రూనగర్ రోడ్లపైకి వచ్చిన నీటిని ఎస్సై వెంకట్రావు, సిబ్బంది, స్థానికులు, పొక్లెయిన్ల సాయంతో తొలగించారు. కోర్టు చౌరస్తాలో రోడ్డుపై నీరు నిలవడంతో ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్సై వినోద్, సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబుకి విషయం తెలిపి ట్రాఫిక్ క్రేన్ సహాయంతో నీటిని మ్యాన్ హోల్‌లోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు.

హైవే 44పై నిలిచిన వాహనాలు

బాల్కొండ: కామారెడ్డి జిల్లా కేంద్రం వద్ద జాతీయ రహదారి 44పై గండి ఏర్పడటంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. వాహనాలను దారి మళ్లించడంతో మెండోరా మండలం పోచంపాడ్ నుంచి బాల్కొండ మండలం శ్రీరాంపూర్ వరకు గురువారం ట్రాఫిక్ స్తంభించింది. హైవే పొడవునా 15 కిలోమీటర్ల మేర ట్రక్కులు నిలిచిపోయాయి. వాహనాలను విడతల వారీగా దారి మళ్లించారు. పోచంపాడ్‌జాతీయ రహదారి 44 కూడలి వద్ద ట్రాఫిక్ వన్ వే ఏర్పాటు చేశారు. డ్రైవర్లకు ఆహారం, నీటిని రెవెన్యూ సిబ్బంది, స్థానికులు సమకూర్చారు. ఓ వైపు వర్షం మరో వైపు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మెండోరా, ముప్కాల్, బాల్కొండ పోలీసులు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ పనితీరును కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఆయన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి పరిస్థితి తలెత్తినా,సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులు,సిబ్బందిని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తోందన్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్ 08462-220183కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

తెయూ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 29, 30వ తేదీల్లో జరగాల్సిన పీజీ, బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ కే సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వాయిదా పడిన పరీక్షల నిర్వహణ తేదీలను తరువాత ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

రూరల్ నియోజకవర్గంలో వరద బీభత్సం



పెద్దవాల్గోట్ వద్ద కోతకు గురైన రోడ్డు



కలిగోట్-చింతలూర్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- కోతకు గురైన రహదారులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ముంపు గ్రామాలను సందర్శించిన అధికారులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, మోపాల్, నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాల్లో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. పలు గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు ఎత్తిపోస్తున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో చెరువులు తెగి ఊళ్లల్లోకి వరద నీళ్లు చేరాయి. ధర్పల్లి మండలంలో వరద నీటిలో చిక్కుకున్న గ్రామాలను రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య పరిశీలించారు. ముంపు బాధితులకు పునరావాస కేంద్రాల్లో వసతి కల్పించి భోజనం అందించారు. డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లి-కొరట్‌పల్లి తండాకు, కొరట్‌పల్లి-మైలారం గ్రామాల మధ్య అధికారులు రాకపోకలను నిలిపివేశారు. బర్దిపూర్ చెరువు నిండి అలుగు పారడంతో ఒడ్డున ఉన్న బర్దిపూర్, ధర్మారం(బి) గ్రామాల్లోని ఇళ్లల్లోకి నీళ్లు చేరాయి. బాధితులను స్థానిక పునరావాస కేంద్రంలోకి తరలించారు.

సిరికొండ మండలంలో కప్పల వాగు, మొండి వాగు, మద్దెల వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాగు పరిసరాలల్లో పంటపొలాలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. వాగు పరిసర గ్రామాలైన తూంపల్లి, గడ్కోల్, కొండూర్, పెద్దవాల్గోట్, చిన్న వాల్గోట్ గ్రామాలను వరద ముంచెత్తింది. కొండాపూర్-తూంపల్లి గ్రామాల మధ్య కల్వర్టు కొట్టుకుపోయింది. మొండివాగు బ్రిడ్జి వద్ద వరద ఉధృతికి రోడ్లు కొట్టుకుపోయాయి.

ధర్పల్లి మండలంలోని ముత్యాల చెరువు తెగిపోవడంతో కప్పల వాగులోకి వరద పోటెత్తింది. దీంతో కప్పలవాగు బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. సమీప గ్రామాల్లోని ఇళ్లలోకి వరద నీరు వచ్చిచేరింది. వాడి, బీరప్ప తండాలో పంట నష్టం భారీగా జరిగింది. ముంపునకు గురైన వాడి గ్రామాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య సదర్శించారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఇందల్వాయి మండలంలో గన్నారం చిన్నవాగు ఉధృతికి విద్యుత్ సబ్‌స్టేషన్ వరద నీటిలో చిక్కుకుంది. సిర్నాపల్లి గ్రామం రామ్‌సాగర్ తండా చెరువు తెగిపోయి వరద నీటిలో స్వర్గరథం కొట్టుకుపోయింది. పలు గ్రామాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. సిర్నాపల్లి- గన్నారం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్-చింతలూరు గ్రామాల వద్ద పెద్ద వాగు వంతెన పైనుంచి ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

మోపాల్ మండలంలో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. ఎల్లమ్మకుంట వెళ్లే రోడ్డును అధికారులు మూసివేశారు.

నిజామాబాద్‌రూరల్ మండలంలోని పాంగ్రాలో నివసిస్తున్న కొందరు వరద బాధితులను నగరంలోని బింగి కల్యాణ మండపంలో పునరావాస కేంద్రానికి తరలించారు. గూపన్‌పల్లి శివారులో పులాంగ్‌వాగు వంతెన పైనుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలను నిలిపివేశారు. ముత్తకుంట-కుర్నాపల్లి గ్రామాల మధ్య వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

హంగర్గను చుట్టుముట్టిన ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్



బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని హంగర్గ గ్రామాన్ని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ చుట్టుముట్టింది. గురువారం సాయంత్రం మంజీర నదిలో ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరగడం, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వెనక్కి నెట్టడంతో గ్రామంలోకి వరద నీరు చేరుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ విఠల్ గ్రామంలోనే ఉంటూ పరిస్థితులను సమీక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టారు. ముంపు బాధితులను గుర్తించి వారి బంధువుల ఇళ్లకు తరలించారు. పాడి పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఖండ్‌గావ్ గ్రామ శివారులోని మంజీర బ్రిడ్జి పైనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మహారాష్ట్ర నుంచి రాకపోకలు నిలిపివేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆశ్రమంలోని వారిని కాపాడిన రెస్క్యూ బృందం



రెంజల్(బోధన్): గోదావరికి వరద పోటెత్తడంతో కందకుర్తి పుష్కరక్షేత్రంలోని సీతారాం త్యాగి మహారాజ్ ఆశ్రమం చుట్టూ వరద నీరు చేరింది. దీంతో ఆశ్రమంలో స్వామీజీతో పాటు ముగ్గురు శిష్యులు, ముగ్గురు భక్తులు అక్కడే చిక్కుకున్నారు. గురువారం సాయంత్రం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై చంద్రమోహన్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ గ్రామానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. వెంటనే రెస్క్యూ బృందాలను రప్పించి ఆశ్రమం వద్దకు పంపించారు. గంటన్నర వ్యవధిలో రెస్క్యూటీం బృందం మహారాజ్ శిష్యులతోపాటు భక్తులను సురక్షితంగా గ్రామానికి చేర్చారు.

12,413 ఎకరాల్లో పంటకు నష్టం

నిజామాబాద్‌అర్బన్: భారీ వర్షాల కారణంగా జిల్లాలో 12,413 ఎకరాల విస్తీర్ణంలో పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, భీమ్‌గల్, ఇందల్వాయి మండలాల్లోని కొండాపూర్, తూంపల్లి, గడ్కోల్, ముషీర్ నగర్, హొన్నాజీపేట్, వాడి, నడిమితండా, బెజ్జోరా, సిర్నాపల్లి గ్రామాలపై వరద తీవ్ర ప్రభావం చూపింది. 13 చోట్ల పంచాయతీరాజ్, 29 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయి. ఓ ఇల్లు పూర్తిగా కూలిపోగా, ఆరు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 60 విద్యుత్ స్తంభాలు, మరో 60 కండక్టర్లు పడిపోయాయి, కొన్ని చోట్ల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. ఎనిమిది గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

పునరావాస కేంద్రాలు

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం చందూర్, ధర్పల్లి, డిచ్‌పల్లి, నిజామాబాద్ రూరల్, జక్రాన్‌పల్లి మండలాల్లో ఏడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆహారం, తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించారు, 164 కుటుంబాలకు చెందిన 358 మంది పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వరదలో చిక్కుకున్న 17 మందిని సురక్షితంగా కాపాడారు. ఇందల్వాయి మండల దోన్కల్‌లో ఫామ్‌హౌస్ లో చిక్కుకుపోయిన ఓ వ్యక్తితోపాటు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద 8 మందిని కాపాడారు.

నాలుగు మండలాల్లో విద్యా సంస్థలకు సెలవు

నిజామాబాద్‌అర్బన్: వర్షాల కారణంగా జిల్లాలోని నాలుగు మండలాల్లో బడులకు శుక్రవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరికొండ, భీమ్‌గల్, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, గురుకులాలు, కళాశాలలు బంద్ పాటించాలని పేర్కొన్నారు.

సెల్ఫీ తెచ్చిన తంట



బోధన్‌టౌన్(బోధన్): భారీ వర్షాలకు బోధన్‌లోని బెల్లాల్ చెరువు అలుగు పారడంతో ఓ యువకుడు సెల్ఫీ తీసుకోవడానికి వెళ్లి, అక్కడే చిక్కుకున్నాడు. స్థానికులు తాళ్ల సాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. పట్టణంలోని కుమ్మరిగల్లీకి చెందిన నవీన్ గురువారం బెల్లాల్ చెరువు వద్దకు వెళ్లాడు. అలుగు పారడంతో సెల్ఫీ తీసుకోవడానికి యత్నించగా కాలు జారి అలుగు పైనుంచి కిందపడడంతో అక్కడే చిక్కుకున్నాడు. సమాచారం అందుకున్న మత్స్య పారిశ్రామిక సంఘం పట్టణ అధ్యక్షుడు అక్కడికి చేరుకొని గజ ఈతగాళ్లతోపాటు అక్కడే ఉన్న యువకుల సహాయంతో తాడు అందించి బయటకు తీశారు.

అప్రమత్తంగా ఉండాలి

- వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- అవసరమైన చోట్ల పోలీసు బందోబస్తు, పికెట్
- అధికారులకు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి దిశానిర్దేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. రానున్న 48 గంటలపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పోలీస్ కమిషనర్ సాయిచైతన్యతో కలిసి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఉదయం నుంచి జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై సమీక్షించారు. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటికి రావాలని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు, తెగిన విద్యుత్ వైర్ల వద్దకు వెళ్లొద్దన్నారు. అవసరమైన చోట్ల పోలీసు బందోబస్తు, పికెటింగ్ ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎవరూ బయటకు రావొద్దు

- ఎలాంటి అపోహలను నమ్మవద్దు
- సీపీ పోతరాజు సాయిచైతన్య

ఖలీల్‌వాడి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ పోతరాజు సాయి చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అలాగే పలు సూచనలు, సలహాలు చేశారు.

- ఎక్కడైన విద్యుత్ తీగలు కింద పడ్డా లేదా వేలాడుతున్న లేదా వర్షపు నీటికి తగిలినా వాటిని ఎవరూ తాకరాదు.
- గణేష్ మండలి నిర్వాహకులు మండపం వద్ద తగు జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి. ప్రధానంగా విద్యుత్ తీగల వద్దకు ఎవరు వెళ్లవద్దు.
- పొంగిపొర్లనున్న వాగులు, వంకల వద్దకు వెళ్లవద్దు. జలాశయాలు, చెరువులు, కుంటలు చూడడానికి వెళ్లకూడదు. ప్రమాదానికి గురయ్యే అవకాశముంది.
- వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి.
- పురాతన కట్టడాలు లేదా పురాతనమైన ఇళ్లు ఉన్నట్లయితే వర్షాలకు తడిసి కూలిపోయే అవకాశాలు ఉన్నాయి. కావున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి.
- ఎక్కడైనా వరద ఉధృతి తలెత్తిన సందర్భంలో పోలీసు సిబ్బంది, అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి, ప్రాణ నష్టం లేకుండా చూడాలి.
- రెవెన్యూ, మున్సిపల్, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక, ప్రజా రవాణా, నీటి పారుదల వంటి అన్ని విభాగాలతో పోలీసులు సరైన సమన్వయం చేసుకోవాలి.
- ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్‌ను సంప్రదించాలి.

పెద్దవాగు ఉగ్రరూపం

- తొలిసారి 6.4 మీటర్ల ఎత్తులో ప్రవహించిన వరద
- 1989లో 5.2 మీటర్ల ఎత్తులో ప్రవాహం



గాంధారిపేట్‌లోని పెద్దవాగు ప్రవాహాన్ని లెక్కిస్తున్న సీడబ్ల్యూసీ ఉద్యోగులు

మోర్తాడ్(బాల్కొండ)/బాల్కొండ: కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో విస్తరించిన పెద్దవాగు ఉగ్రరూపం దాల్చింది. కామారెడ్డి జిల్లాలో బుధవారం కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు నీటి ప్రవాహం 6.4 మీటర్ల ఎత్తులో సాగింది. 1989లో తొలిసారి పెద్దవాగు 5.2 మీటర్ల ఎత్తులో ప్రవహించగా మధ్య కాలంలో 5 మీటర్లకు తక్కువ లోతులోనే నీటి ప్రవాహం సాగింది. బాల్కొండ నియోజకవర్గంలో వేల్పూర్, మోర్తాడ్, ముప్కాల్, మెండోరా మండలాల మీదుగా ప్రవహించే పెద్దవాగు పరిసరాల్లో పంటలు నీటమునిగాయి. ఎస్సారెస్పీ నుంచి వరద నీటిని గేట్లు ఎత్తి గోదావరిలోకి విడుదల చేయడం, పెద్దవాగు ప్రవాహం తోడుకావడంతో తడపాకల్ వద్ద నది ఉధృతి మరింత ఎక్కువ అయ్యింది. పెద్దవాగు నీటి ప్రవాహంను సెంట్రల్ వాటర్ కమిషన్ ఉద్యోగులు లెక్కించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ముప్కాల్ మండలం వెంచిర్యాల్, మెండోరా మండలం వెల్కటూర్ గ్రామాల్లోనే సుమారు 300 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల

సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీలకు సంబంధించి డ్రాఫ్ట్ ఓటరు జాబితాను జిల్లా అధికారులు గురువారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఈ జాబితా ప్రకారం 8,51,417 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 3,96,778 మంది పురుషులు, 4,54,621 మహిళలు, 18 ఇతరులు ఉన్నారు. మండలాల వారీగా జాబితాలను అన్ని మండల పరిషత్ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో గురువారం అధికారులు ప్రదర్శించారు. నేడు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. అదే విధంగా 30న మండల పరిషత్ కార్యాలయాల్లో గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధులతో ఎంపీడీవో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ జాబితాపై 28 నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 31న అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. సెప్టెంబర్ 2న రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డుల వారీగా , పోలింగ్‌స్టేషన్ల వారీగా తుది ఓటర్ జాబితాను ప్రదర్శిస్తామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

'అలీసాగర్' మూడు గేట్ల ఎత్తివేత



బోధన్: భారీ వర్షాలు, నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత నేపథ్యంలో ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులోగల అలీసాగర్ రిజర్వాయర్‌కు భారీ వరద చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1299.6 ఫీట్లు కాగా గురువారం సాయంత్రం వరకు 1297.10 ఫీట్లకు వరద నీరు చేరింది. ఈ క్రమంలో అధికారులు ఉదయం రెండు గేట్లు, సాయంత్రం మరో గేటును ఎత్తి 1400 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నిజాంసాగర్ డి-50 కాలువల్లోకి వదిలారు. మూడు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 1500 క్యూసెక్కులకు పైగానే ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి రిజర్వాయర్‌లో మరింతగా ఇన్‌ఫ్లో పెరిగితే దిగువకు నీటి విడుదల పరిమాణాన్ని పెంచే అవకాశం ఉంది. ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లో విస్తరించిన ఉన్న నిజాంసాగర్ డి-50 కాలువ కింద పంటలు నీట మునిగే అవకాశాలున్నాయి.

జల్లాపల్లి ఫారంలో ఒకరి ఆత్మహత్య

రుద్రూర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంకు చెందిన నేనావత్ రాందాస్ (23) అనే యువకుడు మద్యానికి బానిసై, తరచూ ఇంట్లో ఘర్షణ పడేవాడు. ఈక్రమంలో బుధవారం డబ్బులు కావాలని కుటుంబ సభ్యులతో గొడవపడి అతడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సింధు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

క్రైం కార్నర్


ఆటో బోల్తా పడి ఒకరి మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని యాచారం-వజ్జపల్లి గ్రామాల శివారులో ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందారు. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని దగ్గి గ్రామానికి చెందిన దేగులవాడి యేసప్ప(56)ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి తన ఆటోలో ప్రయాణికులను తీసుకొని యాచారంలో దింపి తిరిగి గ్రామానికి బయలుదేరాడు. యాచారం-వజ్జపల్లి గ్రామాల శివారులో ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో యేసప్ప ఆటో కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను గమనించకపోవడంతో ఆటో బోల్తా కొట్టి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎం ఢీకొని ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద డీసీఎం వ్యాన్ ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని వర్ని చౌరస్తా బోయగల్లీకి చెందిన కిషన్ (45) గురువారం సాయంత్రం చికెన్ తీసుకురావడానికి బయటకు వెళ్లాడు. నడుచుకుంటు వస్తుండగా అతడిని డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో స్థానికులు వెంటనే డీసీఎంను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఐర్లాండ్‌లో గుండెపోటుతో మెండోరా వాసి మృతి



అన్వేష్‌రెడ్డి(ఫైల్)

బాల్కొండ: మెండోరాకు చెందిన సామ అన్వేష్‌రెడ్డి(30) ఐర్లాండ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం అక్కడ విధుల్లో ఉండగానే గుండెపోటు రావడంతో తోటివారు అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు తెలిపారు. నాలుగు నెలల క్రితమే సెలవుపై వచ్చిన అన్వేష్‌రెడ్డి తన మేన మరదల్ని వివాహం చేసుకున్నారు. మళ్లీ ఇటీవల ఐర్లాండ్ వెళ్లాడు. పండుగ పూట అతడి మరణ వార్త వినడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటుతున్నాయి.

చోరీకి యత్నించిన నిందితుడికి దేహశుద్ధి

ఆర్మూర్‌టౌన్: మహిళ వద్ద ఉన్న బంగారం, డబ్బులను చోరీ చేయడానికి యత్నించిన నిందితుడిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం మిర్దాపల్లి గ్రామానికి చెందిన ఏలేటి నర్సవ్వ బుధవారం వ్యవసాయ పనులు చేస్తోంది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన జాదవ్ అనే వ్యక్తి అమెపై కట్టెతో దాడి చేశాడు. నర్సయ్య వద్ద ఉన్న బంగారం, డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో పారిపోయాడు. అనంతరం ఆమె తన భర్తకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులతో కలిసి జాదవ్‌కు వెతికి పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. జాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.


విద్యార్థి అదృశ్యం



శివ (ఫైల్)

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన ఇరుగందుల శివ (17) అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, సోమవారం కాలేజీకి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.


కుక్క దాడిలో పలువురికి గాయాలు



గాయపడిన చిన్నారి శిరీష

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గురువారం పిచ్చి కుక్క దాడి చేయగా పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి శిరీషతో పాటు మరో ఇద్దరిపై దాడి తీవ్రంగా గాయపరిచింది. అలాగే ఏడు గేదే దూడలను కూడ తీవ్రంగా గాయపరిచింది. దీంతో స్థానికులు వెంటపడి పిచ్చికుక్కను చంపివేశారు. గాయాలపాలైన వారు బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బోధన్‌లో పావురం కలకలం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో పావురం కలకలం రేపింది. స్థానికులు పట్టుకొని చూడగా పావురం కాళ్లకు రింగులు, కోడ్‌తో కూడిన కాగితాలు కట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పావురాన్ని ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. పావురం ఎక్కడి నుంచి వచ్చింది, దాని కాళ్లకు ఉన్న రింగులపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. కాగా, పది రోజుల క్రితం బోధన్ మండలం భవానీపేట్ గ్రామంలో ఇలాంటి పావురమే కనిపించింది.

వరదలో చిక్కుకొని రైతు మృతి



రాజిరెడ్డి (ఫైల్)

బీబీపేట: భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదల్లో మండలంలోని జనగామకు చెందిన ఓ రైతు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జనగామకు చెందిన కప్పెర రాజిరెడ్డి (63) వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించేవాడు. సాగు పనుల నిమిత్తం బుధవారం పొలం వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి పొలం పక్కకే ఎడ్ల కట్ట వాగు ప్రవహిస్తుండడం, బీబీపేట పెద్దచెరువు పూర్తిగా నిండి బ్యాక్ వాటర్ పొలంలోకి చేరడంతో అందులో గల్లంతయ్యాడు. గ్రామస్తులు ఎంత వెతికినా అతడి ఆచూకి లభించకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు గురువారం ఉదయం గాలింపు చేపట్టగా రాజిరెడ్డి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రహరీ కూలి యువ వైద్యుడు..



వినయ్ (ఫైల్)

రాజంపేట: వరద నీటిని మళ్లించే ప్రయత్నంలో ప్రహరీ కూలి రాజంపేటలో యువ డాక్టర్ ఇప్పకాయల వినయ్ (28) మృతి చెందాడు. బుధవారం కురిసిన భారీ వర్షంతో బీసీ కాలనీకి సమీపంలో ఉన్న దేవుని చెరువు అలుగుపారింది. చెరువులోకి వచ్చే కట్టు కాలువ ఉధృతి పెరిగి నీరు బీసీ కాలనీ వైపు తిరుగుముఖం పట్టి ఇళ్లలోకి చేరింది. వినయ్ ఇంట్లోకి సైతం నీళ్లు చేరడంతో వాటిని మళ్లించేందుకు గడ్డపార సహాయంతో ప్రహరీని కూల్చేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గోడ కూలి మీద పడడంతో వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్ గుండారం పల్లె దవాఖానాలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పండుగ పూట డాక్టర్ మరణించడంతో రాజంపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాత్రి గౌడ్ తెలిపారు.

భారీ వర్షాలపై ఎంపీ అర్వింద్ ఆరా

- కలెక్టర్, సీపీలతో ఫోన్‌లో మాట్లాడి, పరిస్థితిని తెలుసుకున్న ఎంపీ



సుభాష్‌నగర్: జిల్లాలో రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మ పురి ఆరా తీశారు. కలెక్టర్, సీపీలతో ఫోన్లో మాట్లాడి, పరిస్థితి ని తెలుసుకున్నారు. వినాయక చవితి పండుగ సెలవు దినమైనప్పటికీ, అధికారులు బాధ్యతతో పనిచేశారన్నా రు. రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలర్ట్ ఉ న్నందున ఇదే స్ఫూర్తితో బాధ్యతలు నిర్వహించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద బాధితులను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించి, కనీస సౌకర్యాలు అందించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే అధికారులు ఆస్తి, పంట నష్టంపై నివేదికలు తయారు చేసి, ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. తాను కూడా సీఎంకు లేఖ రాస్తానని, హోం శాఖకు సైతం నివేదిస్తానన్నారు. మరోవైపు ప్రజలకు కూడా ఎంపీ అర్వింద్ కీలక సూచనలు చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయకుండా అధికారులకు సహకరించాలన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు 39 గేట్లు ఎత్తినందున పరివాహక ప్రాంత ప్రజలు, పశువుల కాపరులు గోదావరి పరిసర ప్రాంతాలకి వెళ్లకుండా ఉండాలని కోరారు. వినాయక చవితి దృష్ట్యా, మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.